క్లుప్తంగా

మహాలక్ష్మమ్మకు పొంగళ్ల సమర్పణ



విడవలూరు: మండలంలోని వరిణి గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను మంగళవారం సమర్పించారు. ఉభయకర్తలుగా స్థానిక సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున దంపతులు వ్యవహరించారు.

తిరుమలలో రామతీర్థం వాసుల కోలాటం



విడవలూరు: రథసప్తమిని పురస్కరించుకొని తిరుమలలో కోలాట ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఇందులో రామతీర్థానికి చెందిన రాజ్యలక్ష్మి నాట్య బృంద ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనను జరిపారు. ఈ అవకాశం లభించడం చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో మంగళవారం జాబ్‌మేళాను నిర్వహించారు. 68 మంది హాజరుకాగా వారిలో 39 మందికి వివిధ కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించాయి.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టండి

కోవూరు: వసతిగృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి కోరారు. కోవూరులోని హాస్టళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్థానిక వసతిగృహ సముదాయాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలకు అందించే రేషన్, అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులకు అందించే ఆహారాన్ని ఫుడ్ కమిషన్ పరిశీలించనుందని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే వాట్సాప్ నంబర్ 94905 51117కు తెలియజేయాలని కోరారు. తహసీల్దార్ నిర్మలా నందబాబా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడిగా షాహుల్



సత్కరిస్తున్న యువకులు

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం పట్టణాధ్యక్షుడిగా ఐదో వార్డు కౌన్సిలర్ షాహుల్‌ను నియమించారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా షాహుల్ మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నియమించారని చెప్పారు. దీనికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

➡ షాహుల్ నియామకంపై కొత్త బస్టాండ్ సెంటర్‌లో ముస్లిం యువకులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా షాహుల్‌ను సత్కరించి కేక్‌ను కట్ చేయించారు. ఆయన మరిన్ని పదవులను అధిరోహించాలని కాంక్షించారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితం బుగ్గిపాలు

కొడవలూరు: డ్రగ్స్ వాడకంతో జీవితాలు బుగ్గిపాలవుతాయని కొడవలూరు సీఐ సురేంద్రబాబు సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో గల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్సై కోటిరెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఎన్నెస్సెస్ యూనిట్ ఇన్‌చార్జి ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఎన్నికల్లో తమపై చేస్తున్న విమర్శలు సరికాదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ పట్టణ, గ్రామీణ అధ్యక్షులు శేషయ్య, హరికృష్ణ, నగర చైర్‌పర్సన్ సుప్రజ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- ఇదీ డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పరిస్థితి
- మూలనపడిన ఆర్వో ప్లాంట్ పరికరాలు
- మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు
- వాడుక నీటికీ సమస్యలే..
- సొంత నిధులతో నీరు సరఫరా చేయిస్తున్న హెచ్‌ఎం

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ బడులు కొత్త కళను సంతరించుకున్నాయి.నాడు విద్యార్థులకు వసతులు కల్పించారు. చంద్రబాబు పాలనలో పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాల గురించి కూటమి పెద్దలు పట్టించుకోవడం లేదు. 700 మంది విద్యార్థినులు చదువుతున్న పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.



డ్రమ్ముల్లో నీటిని నింపుతూ..

పొదలకూరు: పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల.. జిల్లాలో అధిక సంఖ్యలో బాలికలు చదువుతున్న రెండో స్కూల్‌గా దీనికి పేరుంది. అయితే ఇక్కడ తాగునీటి సమస్యతో విద్యార్థినులు అల్లాడిపోతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగితే ఈ సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశముంది. వాడుక నీరు కూడా సక్రమంగా లభ్యం కావడం లేదని అక్కడి వారు వాపోతున్నారు. అరకొర నీటి సౌకర్యంతో మధ్యాహ్న భోజనం వండేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు పరికరాలు దిగుమతి చేసుకుని రెండేళ్లయింది. ప్లాంట్ ఏర్పాటుకు గది లేకపోవడంతో పరికరాలు మూలనున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు 700 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కొందరు ఇళ్ల నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారు. హెచ్‌ఎం తన సొంత నిధులతో బయటి నుంచి నీటిని తెప్పిస్తున్న నీటిని మరికొందరు తాగుతున్నారు.

బయటి నుంచి..

విద్యార్థినుల దాహం తీర్చేందుకు బయటి నుంచి నీటిని తెప్పిస్తున్నా పరిస్థితి ఉంది. ప్రతినిత్యం రెండు పర్యాయాలు పాఠశాలలోని డ్రమ్ములను నింపి పిల్లలకు అందజేస్తున్నారు. గతంలో నాబార్డు నిధుల కింద అదనపు భవన నిర్మాణంతోపాటు ఆర్వో ప్లాంట్ మంజూరైంది. అయితే గది లేకపోవడంతో నిర్మాణం జరగలేదు. దీనికితోడు పక్కనున్న బాలుర పాఠశాల ప్రాంగణంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా బాలికల పాఠశాల మంచినీటి అవసరాలకు పంపింగ్ చేసే విద్యుత్ మోటార్ కాలిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. స్కూల్ ప్రాంగణంలో పాత కుళాయి కనెక్షన్ ఉంటే దానికి మోటార్ ఏర్పాటు చేసి చాలీచాలకుండా నీటిని వినియోగించుకుంటున్నారు. మోటార్‌కు మరమ్మతులు చేయిస్తే మంచినీటి సమస్య కొంత వరకు తీరుతుంది.



విద్యార్థినులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు



ఆర్వో ప్లాంట్ పరికరాలను వదిలేశారిలా..

నీళ్లు చాలడం లేదు



మధ్యాహ్న భోజనం వండేందుకు నీళ్లు చాలడం లేదు. పిల్లలకు భోజనం పెట్టాలంటే ఇబ్బందిగా ఉంది. వెంటనే చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలి. చాలీచాలని నీటితో వంట చేయడం కష్టంగా ఉంది.

– సుబ్బరత్నమ్మ, భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు, పొదలకూరు

ఇబ్బందిగా ఉంది



పాఠశాలలో మంచినీటికి ఇబ్బందిగా ఉంది. ప్రత్యామ్నాయంగా పాత కుళాయి కనెక్షన్ ఉంటే మోటార్ ద్వారా నీటిని వినియోగించుకుంటున్నాం. మోటార్ కాలిపోవడంతో సమస్యలు తీవ్రతరమయ్యాయి. వాడుకునేందుకు నీరు కూడా సక్రమంగా లభ్యం కావడం లేదు.

– నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు

నివేదిక పంపాం



మంచినీటి సమస్యపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపాం. ఆర్వో ప్లాంట్ నిర్మిస్తే పిల్లల తాగునీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతం సొంత నిధులతో బయటి నుంచి నీటిని కొనుగోలు చేసి పిల్లలకు అందజేస్తున్నాం.

– ఫెర్సిస్, పాఠశాల హెచ్‌ఎం

పోస్టర్ల ఆవిష్కరణ



పొదలకూరు: స్థానిక సీహెచ్‌సీలో గుండెకు భరోసా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్, వైద్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండెనొప్పి వస్తే మొదటి గంటలోగా 108 అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్తారన్నారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి రూ.45 వేల విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. తెల్లవారుజామున వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనసేవ జరిగింది.

పరీక్ష ప్యాడ్ల అందజేత



విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. కళాశాలలో వసతులతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని, ఈ క్రమంలో విద్యార్థులు చేరాలని కోరారు.

సీహెచ్‌సీలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న వైద్యులు

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి దివ్యాంగులు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సోమ, మంగళ, బుధవారం సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. మూడునెలలపాటు కొనసాగుతుందన్నారు. ప్రతినిత్యం 50 నుంచి 60 మంది సర్టిఫికెట్లను నిపుణులైన వైద్యులు పరిశీలించడం జరుగుతుందన్నారు. తొలిరోజున సోమవారం 46 మంది సర్టిఫికెట్లను పరిశీలించినట్టు చెప్పారు. నిర్దేశించిన తేదీల్లో హాజరు కాని వృద్ధులైన దివ్యాంగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరుసటి రోజున వచ్చేందుకు వెసులబాటు ఉందన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం, తాటిపర్తి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఏఓ ఎ.వాసు చీడపీడల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించా రు. వరిలో పంట సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూ చనలిచ్చారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

➡ మనుబోలు: రైతులు రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలని, అలాగే రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాగితాలపూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రసాయన ఎరువుల వాడకం, ఈ–క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల బదులు సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఓ జహీర్‌బాషా, ఏఏఓ కళారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

➡ విడవలూరు: రైతు సేవా కేంద్రాల్లో ఈ – పంటను తప్పక నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లి, చౌకచర్ల గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. వీఏఏలు తమీమ్ అహ్మద్, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

➡ కొడవలూరు: పంట నమోదు చేసుకొని, బయోమెట్రిక్ పూర్తి చేస్తేనే కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయనే అంశాన్ని రైతులు గుర్తుంచుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని మిక్కిలింపేట, కొత్తవంగల్లులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు వంశీకృష్ణ, మౌర్య, వీఆర్వో వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ నిరసన

కొడవలూరు: గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదుట కొడవలూరు, విడవలూరు మండలాల రైతులు నిరసనను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. కాకినాడ పోర్టులో బియ్యం స్మగ్లింగ్ జరుగుతోందంటూ ఎగుమతులు నిలిచిపోయాయనే అపోహలు సృష్టించి ధాన్యం ధరలను అమాంతం తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోతలు ఊపందుకొని మార్కెట్లోకి ధాన్యం వచ్చే సమయానికి ధర మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ స్ఫూర్తికి వినతిపత్రాన్ని సమర్పించారు. రైతులు అశోక్‌రెడ్డి, శ్రీకాంత్, మాధవ, చెంచయ్య, కోటిరెడ్డి, కృష్ణయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు

ముత్తుకూరు: కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తుకూరు పీహెచ్‌సీ వైద్యులు దేవీకృప, జనార్దన్‌లు కేన్సర్ లక్షణాలు, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆధునిక వైద్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సీసీఎస్‌పీ ప్రాజెక్ట్ వైద్యులు రాజేష్, దీప్తి, ఎస్ఈఐఎల్ ప్రతినిధి కుమార్‌రాజు, యూపీ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మి, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

➡ వెంకటాచలం: మండలంలోని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కె.విద్యాసాగర్ పాల్గొని కేన్సర్ గురించి అవగాహన కల్పించారు.



వెంకటాచలం: స్వర్ణభారత్ ట్రస్ట్‌లో..

అవగాహన చాలా అవసరం

వెంకటాచలం: కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధిపై సమాజానికి అవగాహన చాలా అవసరమని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వర్సిటీలో మంగళవారం కేన్సర్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబాలు, సమాజంలో కేన్సర్ పట్ల అవగాహన కల్పించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రముఖ డాక్టర్ వరుణ్ ప్రకాష్ వివిధ అంశాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌రావుకు పరామర్శ



కొడవలూరు: పచ్చ మూకల దాడిలో గాయపడి ఇంట్లో విశ్రాంతి పొందుతున్న నార్తురాజుపాళేనికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, విశ్రాంత వీఆర్వో కొడవలూరు మోహన్‌రావును మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు మంగళవారం పరామర్శించారు. దాడులు చేస్తున్న పచ్చ మూకలు మూల్యం చెల్లించుకోక తప్పదని, ధైర్యంగా ఉండాలని మోహన్‌రావుకు సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, సర్పంచ్ సుప్రియ, నేతలు వీరి సంపత్‌కుమార్, కొండా శ్రీనివాసులురెడ్డి, నెలవాయి మాణిక్యరావు, జనార్దన్‌రెడ్డి, పేట మధు, దేవిరెడ్డి సాయిరెడ్డి, గాలి సునీల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళాధ్యక్షురాలిగా జయంతి



బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలిగా బుచ్చిరెడ్డిపాళెం 18వ వార్డు కౌన్సిలర్ మోర్ల జయంతిని నియమించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అనుమతితో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియమించారని రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మహిళల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని ఆమె చెప్పారు.

పాఠశాలలు, కాలేజీలకు క్రీడా పరికరాలు

- ఏపీ వ్యాయామ విద్య పర్యవేక్షకుడు మహబూబ్‌బాషా

పొదలకూరు: ఈనెలాఖరులోగా రాష్ట్రంలోని బాలికల పాఠశాలు, జూనియర్ కాలేజీలకు రూ.30 వేల విలువైన క్రీడా పరికరాలను అందజేస్తామని ఏపీ బాలికల పాఠశాలల వ్యాయామ విద్య పర్యవేక్షకుడు (ఆర్జేడీ కార్యాలయం) డాక్టర్ మహబూబ్‌బాషా తెలిపారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, మెనూను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్కూల్లో క్రీడా ప్రాంగణం తక్కువగా ఉందని, ఉన్న దాంట్లో అదనపు గదులు, డైనింగ్ హాలు నిర్మాణాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో బాలికలు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకునేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను పొదలకూరుకు రప్పించి వారితో అవగాహన సదస్సును నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో పీఈటీలు, పీడీల ద్వారా తెలుసుకుంటామన్నారు. కొందరు విద్యార్థినులు ఇళ్ల నుంచి మధ్యాహ్న భోజనం తీసుకొచ్చి తింటుండడాన్ని ఆయన గుర్తించి వారితో మాట్లాడారు. పాఠశాలలో భోజనం సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫెర్సిస్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సునంద, ఉపాధ్యాయుడు నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న మహబూబ్‌బాషా

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



బుచ్చిరెడ్డిపాళెం: కోదండరామస్వామి ఆలయంలో..



కోవూరు: గుమ్మళ్లదిబ్బలో..

బుచ్చిరెడ్డిపాళెం: రథసప్తమిని పురస్కరించుకొని పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామివారు సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి మంగళవారం విహరించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

➡ రామకృష్ణానగర్‌లోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు.

కోవూరు: గుమ్మళ్లదిబ్బలో కొలువైన భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని పద్మశాలీల ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 500 మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచాలి

కొడవలూరు: సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. కొడవలూరు పీహెచ్‌సీని మంగళవారం సందర్శించిన ఆమె రికార్డులను పరిశీలించారు. ఫైలేరియా వివరాలను ఆరాతీశారు. వైద్యాధికారి రామకృష్ణ, ఎస్‌యూఓ నాగరాజు, సీహెచ్‌ఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో పరిశీలన

కోవూరు: మండలంలోని ఇనమడుగులో పడుగుపాడు సహకార పరపతి సంఘ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కట్టా సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. త్వరలో నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

కొడవలూరు: భావితరాల భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొడవలూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను సెట్నెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సైకాలజిస్ట్ సురేష్, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 56 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 56 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 165 మందికి గానూ 122 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 79 మందికి గానూ 66 మంది హాజరయ్యారని, 13 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.